www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 3 సెప్టెంబర్ 2023

5

చిత్తూరు



బాబు సొంతింటి నిర్మాణానికి అవాంతరాలు..



కడపల్లి గ్రామంలో కొనసాగుతున్న చంద్రబాబునాయుడు సొంత ఇంటి పనులు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గంలో ఓటమి ఎరుగని నాయకుడు.. మొదట పోటీ చేసిన కాలం నుంచి ఎదురులేకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఏకైక ఎమ్మెల్యే.. నారా చంద్రబాబు నాయుడు. అప్పట్లో కుప్పం నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో అధికార, ఉద్యోగుల దష్టిలో ఒక పనిష్మెంట్ ఏరియాగా (తప్పుచేసిన వారిని సస్పెండ్ చేస్తూ తరువాత శిక్షాస్మతి కాలంగా) ఉండేది. అయితే 1988వ సంవత్సరంలో చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రాష్ట్ర అసెంబ్లీకి పోటీ చేశారు. అప్పటి కాంగ్రెస్ పార్టీ ఓట్లను సైతం తనకు అనుకూలంగా మార్చుకుని విజయకేతనం ఎగురవేశారు. అప్పటి నుంచి నేటి వరకు అక్కడ ఆయనే ఎమ్మెల్యే. గత 27 ఏళ్లుగా ఓటమి ఎరుగక భారీ మెజార్టీతో గెలుపు పొందుతున్న ఏకైక నాయకుడు చంద్రబాబు.

అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ బాగానే ఉన్నప్పటికీ ఆయన మరణంతో ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెస్ కనుమరుగైపోయింది. ఆ ప్రాతినిధ్యాన్ని వైఎస్సార్‌సీపీ అందిచుకుంది. అయినా నేటికీ కుప్పంలో మాత్రం తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురుతూనే ఉంది. కొందరు వైఎస్సార్‌సీపీ అమాత్యులు తాము కుప్పంపై దృష్టి సారించి చంద్రబాబును ఓటమి పాలుచేస్తామని ప్రతిక ప్రకటన చేస్తూ మానసికంగా, రాజకీయ క్షోభ పెట్టేందుకు ప్రయత్నించినా నియోజకవర్గ ప్రజలు మాత్రం స్థానిక నాయకుల విభేదాలను పక్కనపెట్టి చంద్రబాబుకే పట్టం కట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.దీన్ని బట్టి నియోజకవర్గ ప్రజల్లో ఆయనకున్న విశ్వాసం, నమ్మకం ఏమిటో తేటతెల్లమవుతోంది.

కుప్పంలో చంద్రబాబు నాయుడుకు ఓటుహక్కు లేదని, సొంతఇల్లు లేదని ప్రతిపక్షాలు ఇటీవల ప్రెస్‌మీట్‌లు పెట్టి ఆరోపణలు చేస్తున్నాయి. కానీ కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇల్లు చంద్రబాబుదే అని, నేటి వరకు ఎన్నికల సమయంలో ఆయన స్వయంగా వచ్చి నామినేషన్ వేయకపోయినా ఆయనకు సంబంధించిన నామినేషన్ రుసుంను సైతం కుప్పం నియోజకవర్గ ప్రజలు తమవంతు చందాలతో నామినేషన్ను దాఖలు చేయడంతో పాటు 30ఏళ్లుగా ఆయన్ను గెలిపించుకుంటూ తమ కుటుంబ పెద్దగా నిరూపించడం ప్రతిపక్షాలు గమనించాలి. నేడు అధికారపక్ష ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సైతం ఆయనే స్వయంగా వెళ్లి నామినేషన్ దాఖలు చేయడం పాఠకులందరికీ విధితమే.

ఇది ఇలా ఉండగా ప్రతిపక్షాల ఆరోపణలకు సమాధానం ఇస్తూ కుప్పం నియోజకవర్గ పరిధిలోని శాంతిపురం మండలంలో కడపల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన కోటేశ్వరరావు, సిద్ధప్పలకు సంబంధించిన రెండు ఎకరాల భూమిని వారు స్వయంగా స్వచ్ఛందంగా తమ ఇంటి పెద్దబిడ్డ తమ నాయకుడైన చంద్రబాబు నాయుడుకి వితరణ చేస్తూ ఆగస్టు నెల 2021వ సంవత్సరం రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. తదుపిమ్మట శివపురం గ్రామపరిధిలో జూన్ 9వ తేదీ 2022వ సంవత్సరంలో భూమి పూజచేసి బాబు స్వగహ నిర్మాణానికి నాంది పలకడం జరిగింది. అక్కడి నుండి నిర్మాణానికి సంబంధించిన ఇంజనీర్లు మొదటగా జూన్ 11, 2021న ప్రహరీ గోడ నిర్మాణం ప్రారంభించారు. అయితే ఫిబ్రవరి 14, 2022న మదనపల్లికు చెందిన టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చి నిర్మాణం కొనసాగించడానికి అభ్యంతరాలు వ్యక్తంచేశారు. అప్పటినుంచి స్థానికంగా రాజకీయంగా అధికారపక్షం తన వంతు ఎన్ని అవంతరాలు సష్టించాలో అన్ని కొనసాగించారు. దీంతో రాష్ట్రంలోనే చంద్రబాబు ఇంటి నిర్మాణంపై అన్ని మీడియాలోనూ చర్చ జరగడంతో పాటు అగ్రస్థాయి మీడియాలలో చర్చాఘోషిని నిర్వహించడంతో కంగుతిని వెనుకడుగు వేసిన అధికారపత్రం ఎట్టకేలకు చట్టబద్ధంగా కుప్పం నియోజకవర్గంలో శాంతిపురం మండలంలోని కడపల్లి పంచాయతీలో చంద్రబాబు నాయుడు ఇంటి నిర్మాణానికి జూలై 1923వ సంవత్సరం అనుమతి ఇవ్వక తప్పలేదు. ఎట్టకేలకు న్యాయమే గెలుస్తుందని చెప్పిన చంద్రబాబు నాయుడు మాటలు నెగ్గాయనడానికి ఇదే నిదర్శనం.

చంద్రబాబు నాయుడు తన ఇంటిని రెండు ఎకరాల 10సెంట్ల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టడం, 6500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణంతో పాటు సుమారుగా 6500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నియోజకవర్గ ప్రజల సంక్షేమ బాధ్యత సమస్యల విచారణ పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు ఇందుకుగాను రూ.10కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసిన పార్టీ వర్గాల విశ్వసనీయ సమాచారం.



త్రిలోక్

ఎన్ని అవాంతరాలు కలిగించినా ఇంటి పనులను కొనసాగిస్తాం..

- త్రిలోక్, కుప్పం నియోజకవర్గ కార్యకర్తల సంక్షేమ విభాగ కన్వీనర్

అధికార పక్షం ఎన్ని అడ్డకుంటు, అవాంతరాలు కలిగించినా చంద్రబాబు నాయుడు ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేశాం. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎన్నో సంక్షేమ పథకాలతో మొదటగా పైలట్ ప్రాజెక్టుగా కుప్పం నియోజకవర్గాన్ని ఎంచుకొని రైతు సంక్షేమం కోసం ఇజ్రాయిల్ టెక్నాలజీ తుంపన సేద్యం, గ్రీన్‌హౌస్‌లు లాంటి ఆధునిక వ్యవసాయ విధానాలను కుప్పం ప్రజలకు పరిచయం చేశారు చంద్రబాబు. అంతేకాకుండా వ్యవసాయ విధానానికి సంబంధించి విదేశీ ఆధునిక పరిజ్ఞానంతో పాటు వ్యవసాయ పనిముట్లను సరళమైన సామాన్య రైతులకు అందుబాటు ధరలలో రైతులకు అందించి రైతుల పురోగతికి తోడ్పాటును అందించారు. ప్రణాళికాబద్ధంగా కుప్పం నియోజకవర్గ ప్రజల అభివద్ధి కోసం సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకొని విద్య, వైజ్ఞానిక రంగాలలో దష్టి సారించడంతోపాటు నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి పలు ప్రైవేటు సంస్థలను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఒక పారిశ్రామికవాడను సైతం సకల మౌలిక సదుపాయాలతో నిర్మించి పలు అగ్రగామి వ్యాపార సంస్థలను ఆహ్వానించి కుప్పంలో పరిశ్రమలు పెట్టేందుకు కషి చేశారు. అంతేకాకుండా విద్యావ్యవస్థను పెంపొందించే దిశగా అక్షరాస్యతను మండలానికి ఒక జూనియర్ కాలేజ్, మూడు కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల, రెండు కిలోమీటర్లకు ఒక ప్రాథమికోన్నత పాఠశాల, ఒక కిలోమీటర్‌కు ఒక పాఠశాల మంజూరు చేసి ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రత్యేకమైన జీవో నెంబర్ 1191 ప్రకారం వెనుకబడిన ప్రాంతమైన కుప్పం నియోజకవర్గానికి దక్కింది.

ఈ క్రమంలోనే వైద్యరంగా అభివద్ధి కోసం ప్రతి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు కుప్పం నియోజకవర్గ కేంద్రంలో 150 పడకల ఆసుపత్రి నిర్మించి సకల సౌకర్యాలతో వైద్యసదుపాయాల్ని ఉచితంగా పేదలకు అందించడం జరిగింది. ఎన్ని విమర్శలు చేసిన కుప్పం నియోజకవర్గ అభివద్ధి పనులు ప్రజల కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి.

చంపేస్తున్నా పట్టించుకోరా..?



ప్రజాదృష్టి

చిత్తూరు జిల్లాలో కుప్పం, వీకోట, పలమనేరు, బైరెడ్డిపల్లి బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల మండలాల్లో నిరంతరం ఏనుగులు సంచరిస్తూ రైతులు పండించిన పంటలను ధ్వంసం చేయడంతోపాటు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి.. అయితే ఏనుగులు గుంపులుగా వచ్చినప్పుడు పంటల వరకే ధ్వంసం చేసివెళ్లేవి.. కానీ గుంపు నుంచి విడిపోయిన ఒంటరి ఏనుగులు మాత్రం ఈ మధ్యకాలంలో పొలాల్లో దగ్గర ఉన్న మనుషులను విచక్షణ రహితంగా తొక్కి చంపేస్తున్న దారుణమైన పరిస్థితి. ఇప్పటికే దాదాపు ఏడుగురు రైతులను ఏనుగులు తొక్కి చంపేశాయి. ఒకేరోజు గుడిపాల మండలం రామాపురం పరిసర ప్రాంతాల్లో దంపతులను, మరో మహిళను ఒంటి ఏనుగు అతి దారుణంగా తొక్కి చంపింది. ఈఘటనలపై ఫారెస్ట్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఉంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలమనేరు అడవుల్లోకి వస్తున్న, ఉన్న ఏనుగులు ఎన్నో లెక్కలు సక్రమంగా లేవు. తమిళనాడు అడవుల నుండి వచ్చిన ఏనుగుల సంఖ్య 40 నుంచి 90 వరకు పెరిగాయని తమిళనాడు ఫారెస్ట్ అధికారులు చెప్పారు. అయితే చిత్తూరు జిల్లా ఫారెస్ట్ అధికారులు ఎన్ని ఏనుగులు ఉన్నాయా చెప్పలేని పరిస్థితి. ఏనుగుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ అటవీ సమీప ప్రాంతాల గ్రామప్రజలకు, పంటలకు రక్షణ లేకుండా పోతోంది.

ఈ మధ్యకాలంలో ఫలమనేరు ఘాట్‌లో ఓ లారీ ఢీకొనడంతో మూడు ఏనుగులు చనిపోయిన పరిస్థితి చూశాం. అటు ఏనుగులకు రక్షణ లేకుండా ఇటు ప్రజలకు రక్షణ లేకుండా ఉంది జిల్లా పరిస్థితి. రైతులు లక్షల రూపాయలు అప్పులు చేసి పండించిన పంటలను చేతికి వచ్చే సమయానికి ఏనుగులు ధ్వంసం చేస్తూ ఉండడంతో రైతులకు అప్పులే మిగిలుతున్నాయి. దీంతో కొందరు రైతులు వ్యవసాయం చేయడం కూడా మానేస్తున్న స్థితి. మరికొందరు ఏనుగుల నుంచి పంటను కాపాడుకోవడానికి మల్బరీ వైపు మొగ్గుచూపుతున్నారు.

పంట, ప్రాణ నష్టం కలిగినప్పుడు మాత్రమే స్పందించే అటవీశాఖ అధికారులు, ప్రభుత్వం తరువాత ఏనుగుల నివారణకు చర్యలు చేపట్టడం లేదు. దీంతో అటవీ ప్రాంత ప్రజలు నిత్యం భయపడుతూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడు ఏనుగులు ఎటునుంచి వస్తాయో.. ఏ మూల నుంచి దాడి చేస్తాయో.. తెలీక రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకే భయపడుతున్నారు.

అటవీశాఖ అధికారులు శాస్త్రీయమైన పద్ధతుల్లో జన సంచారంలోకి ఏనుగులు రాకుండా చేయలేరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏనుగులు దాడిలో చనిపోయిన రైతులకు నష్టపరిహారం అందడం లేదని, చనిపోయిన రోజు ప్రజాప్రతినిధులు ఆగమేఘాల మీద స్పందిస్తూ అన్ని రకాలుగా ఆదుకుంటామని తూతూమంత్రంగా డబ్బులు చెల్లించి తర్వాత వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో చనిపోయిన వారి కుటుంబాలు ఆఫీసులు చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉంది. కుటుంబంలో ప్రధాన వ్యక్తుల చనిపోయిన తర్వాత వారి కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో ఉన్న అడవులు రోజురోజుకీ అన్యాక్రాంతమవుతున్న ఉండడంతో అడవుల్లో ఆహారం, తాగునీరు తగ్గిపోతోంది. దీంతో అడవుల్లో సంచరిస్తున్న జంతువులకు రక్షణ లేకపోవడంతో పాటు అవి ఆహారం కోసం సమీప గ్రామాలవైపు వచ్చేస్తున్నాయి. కానీ పారెస్టు అధికారులు మాత్రం రైతులు, పశువుల కాపరులను నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నారు తప్ప అన్యాక్రాంతమవుతున్న ఫారెస్ట్ భూములను కాపాడడంలో చొరవ చూపడం లేదు. తమిళనాడు ఫారెస్ట్ అధికారులు ప్రకటించిన తీరు చూస్తే భూములు కబ్జా కావడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. చిత్తూరు జిల్లాలో కూడా ఇదే పరిస్థితి. దీనికి తోడు ఏనుగుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో అడవుల్లో వాటికి సరైన సౌకర్యాలు కల్పిస్తే జనసంచారంలోకి రావు కదా... మరి అలాంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు.. వాటిపై దష్టి పెట్టడానికి ప్రభుత్వాల నుండి సరైన ఆర్థిక సహకారం లేదని కొంతమంది అధికారులు చెబుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిధులు కేటాయించామని బకాయిస్తున్నాయి. మొన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన విధుల్లో కూడా చిత్తూరు జిల్లాలో పలమనేరు నుండి తిరుపతి వరకు ఏనుగుల కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు ఇచ్చే నివేదికను బట్టి ఇవి అమలవుతాయి. ఇప్పటికైనా జిల్లా ఫారెస్ట్ అధికారులు ఏనుగులకు రక్షణ కల్పించడంతోపాటు జనసంచారంలోకి రాకుండా ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజల కోరుతున్నారు. ప్రభుత్వాలు కూడా ఏనుగుల ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు వెంటనే నష్టపరహారం చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని, ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా కందకాలు, సోలార్ ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గ్రూప్ 4 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



గ్రూప్ 4 అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాల మేరకు గ్రూప్ 4కు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీ కోసం సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమంను ఇంచార్జి కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు. శనివారం కలెక్టరేట్‌లో సర్టిఫికేట్‌ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ కంప్యూటర్ పరీక్షలలో అర్హులైన వారికి 1:2 నిష్పత్తి ప్రకారం విద్యార్హత, కుల, ఆదాయ ఇతర సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలన ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 66 పోస్టుల భర్తీ గాను 1:2 నిష్పత్తి ప్రకారం ఎనిమిది టేబుల్స్ ఏర్పాటు చేసి ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఏపీపీఎస్సీ నియమనిబంధనల మేరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, ఏఓ కులశేఖర్, కలెక్టరేట్ సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

రసంలో పడిన విద్యార్థి

- చెయ్యి కాలిన వైనం - ఆలస్యంగా వెలుగులోకి..



ప్రజాశక్తి- చౌడేపల్లి: భోజనానికి వెళుతూ రసంలో పడి ఓవిద్యార్థికి గాయాలైన సంఘటన చౌడేపల్లిలో చోటుచేసుకుంది. ఈ ఉదంతం బయటకు పొక్కనీయకుండా రహస్యంగా ఆసుపత్రికి తరలించి చిన్నారికి చికిత్స చేయించగా బాలిక పెదనాన్న చొరవతో వెలుగులోకి వచ్చింది. మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఉన్నత పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న కొల్లాయి తన్మయి(8) శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో క్యూలైన్ లోకి వెళ్ళింది. లైన్లో వెళు తూ ఉండగా అక్కడ ఏర్పడ్డ తోపులాటల కారణంగా విద్యార్థిని రసం పంపిణీ చేసే పాత్రలో పడుతుండగా అక్కడే ఉన్న వంట చేసే వ్యక్తి బాలికను పట్టుకున్నాడు. అయితే అప్పటికే బాలిక వేడిగా ఉన్న రసములో చెయ్యి పెట్టడంతో తన్మయికి గాయమైంది. ఈవిషయాన్ని బయటకి తెలియజేయకుండా బాలికను ఆసుపత్రికి తరలించారు. మధ్యాహ్నం భోజన సమయంలో ప్రధానోపాధ్యాయుడుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలి. అయితే వారి పర్యవేక్షణ లేనందునే ఈప్రమాదం సంభవించిందని స్థానికులు విమర్శిస్తున్నారు. బాలిక పెదనాన్న ప్రసాద్ ఉపాధ్యాయులను నిలదీయడంతో విషయం గ్రామంలో తెలిసింది. వెంటనే స్థానికులు పాఠశాలకు చేరుకొని మధ్యాహ్నం భోజనం పంపిణీ అస్తవ్యస్తంగా ఉందని సరి చేయవలసిన ఉపాధ్యాయులు పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావత్తం కాకుండా చూసుకుంటామని మండల విద్యాశాఖ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో పరిస్థితి సద్దుమనిగింది.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి..

భూ సమస్యలు పరిష్కరించాలి: సిపిఎం సమరభేరిలో నాయకులు డిమాండ్



పలమనేరులో ధర్నా..

ప్రజాశక్తి- పలమనేరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణ వలన విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ శనివారం పలమనేరు ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా అధ్యక్షత ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం చేపట్టిన సమర భేరి కార్యక్రమంలో భాగంగా ధర్నా చేసినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కోట్లాదిమంది ప్రజల సంపదను బడా కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబానీలకు కట్టబెట్టడాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకంచాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉన్న ఉపాధితని దెబ్బతీస్తున్నదని, ఇంకా నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతున్నదని తెలిపారు. విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి అన్ని రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తూ ఛార్జీలు పెంచాలని ఆదేశిస్తున్నదని దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద రాష్ట్రప్రజలపై వేలకోట్ల రూపాయలు భారం మోపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న రాష్ట్రప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. పలమనేరు ప్రాంతంలోని పేదల భూసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలపై సిపిఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమం గతనెల 30 నుంచి కార్యక్రమాలు జరుగుతున్నాయని 4న మండల రెవెన్యూ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా నాయకులు ఓబుల్ రాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం పోరాట కార్యక్రమాలను చేపట్టిందని ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు నిత్యం జరుగుతున్నాయని వీటిని అరికట్టక పోగా ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాల తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జయంతి, ఈశ్వరయ్య, రాజా, పాకాల సిరామయ్య సుబ్రహ్మణ్యం, గుర్రం సుబ్రహ్మణ్యం కైరు నిషా, కోటూరు నరసింహులు, పంగరగుంట సుధాకర్ వికాస్ పాల్గొన్నారు.

పేదల కాలనీల్లోని సమస్యలు పరిష్కరించాలి

సచివాలయాల వద్ద సిపిఎం నిరసన



చిత్తూరు సచివాలయం ఎదుట ధర్నా..

చిత్తూరుఅర్బన్: నగరం 22వ డివిజన్ తేనెబండ సచివాలయం, నాలుగో డివిజన్ ఇరువారం సచివాలయాల వద్ద పేదల కాలనీల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ధర్నా నిర్వహించి సచివాలయం కార్యదర్శులకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పి.చైతన్య, నగర కార్యదర్శి కాంచివరం సురేంద్రన్ మాట్లాడుతూ 22వ డివిజన్ రాజీవ్ నగర్‌లో గత మూడు నెలలుగా సక్రమంగా బియ్యం వేయలేదని, రేషన్ బండి రావడం లేదని, కాలనీకి ఆనుకొని ఉన్న నీవా నది కాలువలో డ్రైనేజీ నీళ్లు కలిసి కలుషితమవుతున్నాయని, మురుగు పేరుకుపోయి దోమలు పెరుగుతున్నాయని తెలిపారు. నది చుట్టూ ప్రహరీ గోడలు నిర్మిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోలేదని విమర్శించారు. అలాగే ఇరువారం కాలనీల్లోని ప్రజలకు కొండ నుంచి నీరు వస్తున్నాయని, వర్షం పడితే హైవే పై నుంచి కూడా నీరు ఇళ్లలోకి చేరుతున్నాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, వర్షాల కాలంలో ప్రజల అవస్థలు పడకుండా చర్యలు చేపట్టాని కోరారు. నగరంలోని సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈనెల 4వ తేదీ చిత్తూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నామని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో అంజలి, గుణమ్మ, మలర్, రవి, మనోహర్, జోసఫ్, అర్జున్ పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి




గంగవరంలో వినతి..

గంగవరం: మండలంలోని గుండిగల్లు పంచాయతీ గంగాపురంలోని దళతవాడను సిపిఎం నాయకులు ఓబుల్‌రాజు, ఈశ్వర్ సందర్శించారు. వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు పూర్తి అయినా నేటికీ దళితుల పట్ల వివక్ష కొనసాగుతోందన్నారు. దళిత వాడల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని, వారి సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారి అభివృద్ధికి కేటాయించిన సప్లై నిధులు దారి మళ్లించి దళితులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గంగాపురంలోని దళివాడకు సిసిరోడ్డు, డ్రైనేజీ కాలువలు, తాగునీరు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. దళితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తతామని వారు పేర్కొన్నారు. వారి వెంట సుబ్రహ్మణ్యం, జయంతి, కాలనీ వాసులు ఉన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయండి

ప్రభుత్వ కార్యదర్శి జవహర్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పురోగతికి అధికారులు కృషి చేయాలని ఇంఛార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి వివిధ శాఖల కార్యదర్శులైన సాయిప్రసాద్, ప్రద్యుమ్న, బాబు అహ్మద్, అజయ్‌జైన్‌లతో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి లభ్యత, రీసర్వే, రహదారులకు సంబంధించి భూసేకరణ, 4జీ మొబైల్ టవర్స్‌కి భూసేకరణ, మార్కెట్ గోడౌన్లకు సంబంధించి భూసేకరణ పనులు, ఈ క్రాప్ బుకింగ్, పంటల విస్తీర్ణం, వ్యవసాయ యాంత్రీకరణ, వర్షాభావ పరిస్థితులు వచ్చిన ప్రాంతాలలో ప్రత్యామ్నాయ పంటలు గురించి, గురించి జగనన్న పాల వెల్లువ కార్యక్రమం గురించి జరుగుతున్న అభివద్ధి పై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గహ నిర్మాణాలు పూర్తి అయిన ఐదులక్షల నిర్మాణాలకు సంబంధించి గహాలకు పెయింటింగ్, నీటి లభ్యత, ఆర్చిలు, రోడ్లు నిర్మాణం, గ్రామ, వార్డు సచివాలయాలను ఉన్న వేకెన్సీలు, ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉపాధి పథకంలో పనిదినాలను పెంచాలని, గ్రామస్థాయిలో జరుగుతున్న స్వామిత్ర రీసర్వే, జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. చిత్తూరు నుంచి డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, డ్వామా పిడి గంగాభవాని, జిల్లా వ్యవసాయాధికారి మురళీకష్ణ, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ గౌస్‌బాషా, డిసిఓ బ్రహ్మానందరెడ్డి, పిడి హౌసింగ్ పద్మనాభం, డీఈవో విజయేంద్రరావు, పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ గురువారెడ్డి, పశు సంవర్ధకశాఖ జెడి ప్రభాకర్, డిఎల్డిఓ రవికుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసులు

స్కానింగ్ సెంటర్స్‌లో తనిఖీలు



స్కానింగ్ సెంటర్లో తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి ఆదేశాల మేరకు శనివారం పిసిపి ఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు చిత్తూరు నగర పరిధిలోని వివిధ స్కానింగ్ సెంటర్‌లను అకస్మిక తనిఖీ చేశారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, చేసినట్లు రుజువైతే డాక్టర్, నర్సు, గర్భిణికి, వారి వెంటన వెంటన వారికి పిసిపిఎన్డిటి యాక్ట్1994 ప్రకారం వారికి రూ.10వేలు జరిమానా, మూడేళ్లు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మీ హాస్పిటల్, రామలక్ష్మీ హాస్పిటల్, పద్మావతి నర్సింగ్ హోమ్, అపోలో స్కానింగ్ సెంటర్స్‌లో తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ జార్జ్ రాజేంద్రప్రసాద్ ఆరోగ్య విద్యాధికారి పాల్గొన్నారు.

చిత్తూరుకు త్వరలో..

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక పెన్షనర్స్ భవన్‌లో శనివారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. చిత్తూరు అపోలో ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలని కోరుతూ అపోలో ప్రతినిధికి స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా అపోలో చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరేష్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఒకే అజెండాతో తమకు పేషెంట్ సేవలు పెంచాలని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అభివృద్ధి చేసి అన్ని ముఖ్య డిపార్ట్‌మెంట్లు ఇక్కడే ఉండాలన్నారు. వేలూరు, తిరుపతికి రిఫర్ చేయకుండా అన్నిసేవలు అందాలన్నారు. అనంతరం అపోలో చీఫ్ ఆపరేటర్ మాట్లాడుతూ 2016లో చిత్తూరు ప్రభుత్వఆసుపత్రి తీసుకున్నామని, మునుపు ప్రభుత్వ మినిమం సేవలకన్నా తాము దశలవారీగా చాలా అభివృద్ధి చేశామన్నారు. గతంలో 310 పడకల నుండి 850 పడకల గాను, ఐసియును 10 నుండి 66 పడకలగాను పెంచామన్నారు. అలాగే వచ్చే నెల యూరాలజీ విభాగాన్ని ప్రారంభిస్తామని, ముఖ్యంగా 2024లో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిగా (ఎంసీఐ నిబంధనలు, ప్రోటోకాల్ ప్రకారం) పెంచుతామన్నారు. సిబ్బంది వేతనాలు నెలకు సుమారు రూ.5 కోట్లు చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు రూ.80కోట్లు దాకా ఖర్చు చేశామని ఇవన్నీ అపోలో చైర్మన్ ప్రతాప్‌సి రెడ్డి సొంతచారిటీ నిధులతో ఆయన సొంత జిల్లా కనుక చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు తాండవ మూర్తి, శివకుమార్, సత్య, వరదరాజులు, సారథి, కుమరేషన్, మురళి, శ్రీదేవి పెన్షనర్ భవన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ హరిప్రసాద్ రెడ్డి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జగనన్న ఇళ్ళ కార్యక్రమంలో వేగవంతం చేయాలని ఇన్చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీకి మంజూరైన వజ్రాలపురం గ్రామం వద్ద లేఅవుట్‌ను జగనన్న ఇళ్ళనిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలైన లబ్ధిదారులను గుర్తించాలని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గుణశేఖర్ రెడ్డి, సర్పంచ్ వాణిప్రియ, ఎంపిటిసి హేమచంద్ర, వీఆర్వో పలని, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, సచివాలయ సైట్ ఇంజనీర్, వార్డుసభ్యులు సురేంద్ర, రఘుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



ప్రజాశక్తి- యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లో క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయాలని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరిమాకులపల్లి గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిహెచ్ఓ మాట్లాడుతూ మాతా శిశు మరణాలను పూర్తిగా నిర్మూలించేందుకే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకల కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. గర్భవతులకు చిన్నారులకు 100శాతం వ్యాధినిరోధక టీకాలు వేయాలన్నారు. ఎవరైనా తప్పిపోయి ఉంటే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో వారికి టీకాలు అందించాలన్నారు. త్రైమాసికానికి గర్భవతుల నమోదు ఆసుపత్రుల్లో కాన్పు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియ కుమారి, ఆశా కార్యకర్త భువనేశ్వరి ఉన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- సోమల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం చేతుల పరిశుభ్రత (హ్యాండ్‌వాష్)పై ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆహారం తినే ముందు కచ్చితంగా చేతులు పరిశుభ్రంగా ఏవిధంగా కడుక్కోవాలన్న విషయాన్ని విద్యార్థులకు చూపించి పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. చేతిపై కంటికి కనపడని సూక్ష్మ క్రిములు ఉంటాయని సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కొని ఆ తర్వాత ఆహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం




ప్రజాశక్తి- సోమల: సోమల మండలం బోనమంద ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ శుక్రవారం మతి చెందిన బ్రహ్మం కుటుంబాన్ని సోమల ఎంఈఓలు శ్రీరాములు, శివరత్నమ్మ శనివారం పీలేరులో పరామర్శించి, మతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'సర్పంచ్ వద్దన్నా.. జల్లికట్టు...'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తమకు తెలియజేయకుండా తమ గ్రామంలో జల్లికట్టును ఆదివారం నిర్వహిస్తున్నారని కుప్పం మండలం వానగట్టపల్లి సర్పంచ్ పార్వతి తనయుడు రామచంద్ర వాపోయారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామచంద్ర మాట్లాడుతూ తమ గ్రామంలోని లక్ష్మీ కాంతయ్య, బసవరాజ, మోహన్‌బాబు ఎద్దుల పండుగను నిర్వహించేందుకు కరపత్రాలు ముద్రించారని, అందులో తమ పేరును ముద్రించి గ్రామంలో పంచుతున్నారని తెలిపారు. తమకు తెలియకుండానే తమ పేరును ఎలా ముద్రిస్తారని పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమనే బైండోవర్ చేసుకుని జల్లికట్టు నిర్వహించే వారిని వదిలివేయడం బాధాకరమన్నారు. కనీసం సర్పంచ్‌కి కూడా తెలియజేయకుండా జల్లికట్టు నిర్వహించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పోలీసులు ఆదివారం జరగనున్న జల్లికట్టుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల గ్రామపంచాయతీ పరిధిలోని 250 కుటుంబాలకు చెందిన మహిళలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఖాళీ బిందెలతో శనివారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా తాగనీరు లేక పంట పొలాల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని, సర్పంచ్‌కి తెలిపినా పెట్టిన బిల్లులు రావడం లేదని చెప్పడంతో సమస్యల పరిష్కారం కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెకాల్సిన పరిస్థితి వచ్చిందని కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించేది లేదని పలమనేరు- నెల్లిపట్ల జాతీయ రహదారిపై బైఠాయించారు. ఎన్నికల్లో తమ దగ్గరకు వచ్చి ఓట్లు అడిగే నాయకులకు తమ సమస్యలను పట్టించుకోరా అని ప్రశ్నించారు. మూడు నెలలుగా తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నామని, పొలాల నుంచి తెచ్చుకోవల్సిన దుస్థితి నెలకొంది వాపోయారు. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకుని రాస్తారోకో చేస్తున్న మహిళలతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి మహేష్ త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

మరపురాని మహానేత వైఎస్సార్

ప్రజాశక్తి - కార్వేటినగరం: వైఎస్సార్ 14వ వర్ధంతిని పురస్కరించుకుని మండల కార్యాలయ సముదాయం ఆవరణంలో ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహానికి మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, చందురాజు, పురుషోత్తంరాజు, వెంకటస్వామి, సుబ్బారావు, రఫీ, పద్మణాలశెట్టి, వెంకటస్వామి, పలువురు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం, 49 కొత్తపల్లిమిట్ట ప్రధాన వాణిజ్య కూడలిలో వైయస్సార్ విగ్రహానికి రాష్ట్ర ఆర్టీసీ వైస్‌చైర్మన్ ఎంసి విజయనందరెడ్డి, సర్పంచులు, హరిత కుప్పయ్య, డివి.డిల్లెయ్య, మండలంలోని 23 పంచాయతీలకు సంబంధించిన వైసిపి నాయకులు వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి, జనార్దన్ విజయబాబు, సూరిరెడ్డి, కోటిరెడ్డి బాబుహరిరెడ్డి, దామోదరం పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలోని వైయస్సార్ విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కష్ణమూర్తి అధ్యక్షతన డిసిసిబి బ్యాంక్ ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కష్ణమూర్తి, ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి కేశవులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలో వైయస్సార్ 14వ వర్ధంతి కార్యక్రమం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవ వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన చేశారు. మొగిలి వెంకటగిరి గ్రామంలో సమితి ఉపాధ్యక్షులు తులసి రామకష్ణారెడ్డి రాజశేఖర్ రెడ్డి చిత్రపటాల నుంచి నివాళులర్పించి అన్నదాన చేశారు.


గంగాధర నెల్లూరు: వైఎస్సార్‌కు పేదల హదయాల్లో చెరగని ముద్ర వేసారని రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, గంగాధర నెల్లూరు, నెల్లేపల్లె, బుక్కాపట్నం సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యం, గంగయ్య, మునిరాజారెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, తూగుండ్రం సచివాలయ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని మార్కెట్‌యార్డ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ పూలమాలలు వేసి నివాళులు అర్పించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గంగవరం మండలం కీలపల్లి గ్రామానికి చెందిన ఆనంద్ కుమార్, వీకోట పట్టణం హనుమేపల్లి ప్రాంతానికి చెందిన జాకీర్ ఖాన్‌కి ప్రభుత్వం ద్వారా మంజూరైన 8 లక్షల 20 వేళా రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురంలో..

వెదురుకుప్పం: మండలం పచ్చికాపలం దాసర కాలనీ, వైయస్సార్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



పలమనేరులో..



బంగారుపాళ్యంలో..

వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ

శాంతిపురం: రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మహానేతను స్మరిస్తూ శాంతిపురం మండల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ చొరవతో మంజూరైన ట్రైసైకిళ్లను రాళ్ళబూదుగూరు పంచాయతీ పరిధిలోని తొమ్మిది మంది వికలాంగులకు ట్రైసైకిళ్లను జడ్పిటిసి సభ్యులు శ్రీనివాసులు శనివారం సచివాలయం వద్ద పంపిణీ చేశారు.

చిరువ్యాపారులకు సోలార్ లైట్ల పంపిణీ


సోమల: వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, సోమల ఎంపీపీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు సోలార్ లైట్లు శనివారం పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్‌లు నాగేశ్వరరావు, మోహన్ పాల్గొన్నారు.

సదుంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు.

చౌడేపల్లి: స్థానిక బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ గాజుల రామ్మూర్తి, మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ, సర్పంచ్ శ్రీరాం భరత్‌వరుణ్, హెచ్‌డిఎస్ ఛైర్మన్ గడ్డంవారిపల్లి ఎంపిటిసి తొండ శ్రీరాములు, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

పెద్దపంజాణి: వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా మండల వ్యాప్తంగా వైఎస్ఆర్ కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆర్ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డప్ప, జిల్లా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నగరి: వైయస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా మంత్రి ఆర్కే రోజా సోదరులు వై రాంప్రసాద్ రెడ్డి వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం మున్సిపల్ కార్మికుల అందరికీ అన్నదానం చేశారు.



సోమలలో..

ద్రావిడ యూనివర్శిటీలో ప్రత్యేక ఉపన్యాసం

'సిరి' కన్నడ ప్రతిక ఆవిష్కరణ



ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం కన్నడ విభాగం డాక్టర్ ఎంఎస్.దుర్గాప్రవీణ్ ఆధ్వర్యంలో 'బేంద్రె మరియు మధురచెన్న కావ్యాల్లో తులనాత్మక పరిశీలన' అన్న అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమానికి బెంగళూరు శేషాద్రిపురం ఈవినింగ్ కళాశాల కన్నడ విభాగాధిపతి, ప్రముఖ కన్నడకవి డాక్టర్ సత్యమంగళ మహాదేవ విచ్చేసి ప్రసంగించారు. కావ్యానికి ఆధ్యాత్మిక అనుభూతి విశిష్టమైన అందాన్నిస్తుందన్నారు. చాలా చిన్నచిన్న శబ్దాల్లోనే సంకీర్ణమైన విషయాలను కూడా చెప్పే మాధ్యమంగా కూడా కవిత్వం కనబడుతుందన్నారు. దీన్ని కన్నడ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవి బేంద్రె మరియు మధురచెన్న కవుల్లో తులనాత్మక అధ్యయనం నిరూపించబడిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎకె.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... కన్నడ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపన్యాసాల సిరీస్ విద్యార్థులకు చాలా విలువైందని.. వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కావ్యాన్ని తులనాత్మకంగా పరిశీలన చేసేందుకు ద్రావిడ భాషలకు ఇలాంటి ఉపన్యాసాలు సహాయపడుతుందన్నారు. లాంగ్వేజ్ డీన్ ఆచార్య బిఎస్.శివకుమార్ మాట్లాడుతూ కన్నడ కావ్యాల్లోని ఇలాంటి విశిష్టమైన అంశాలు ద్రావిడ కవిత్వాన్ని అభ్యాసం చేయడానికి సహాయపడుతుందని అన్నారు. డాక్టర్ ఎంఎస్.దుర్గాప్రవీణ్ మాట్లాడుతూ కన్నడ విభాగం ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలు విజయవంతమైందన్నారు. వర్సిటీతో పాటు ఆన్‌లైన్ ద్వారా వీక్షించిన ఇతర కళాశాలల విద్యార్థులు సైతం ఆకర్షించడం తమకు సంతోషాన్నిచ్చిందన్నారు. అనంతరం విభాగ విద్యార్థులు నడిపిస్తున్న సిరి కన్నడ వాల్ ప్రతిక ఆవిష్కరించారు. అదేవిధంగా అతిథిగా విచ్చేసిన డాక్టర్ సత్యమంగళ మహాదేవని వర్సిటీ తరపున ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆచార్య జయలలిత, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా...

రక్తదాన శిబిరం



బంగారుపాళ్యంలో..

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్.పురం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చిరంజీవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ పొన్న యుగంధర్ పాల్గొని రక్తదానం చేసి భారీ కేక్ కట్ చేసి మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. మండల యువత అధ్యక్షులు బాలరాజు, హరిశ్వర్, చామంతి సురేష్, మహేష్ రాయల్, చందు భరత్, అవినాష్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పార్టీ బలోపేతానికి పనిచేయాలని మండల జనసేన పార్టీ అధ్యక్షులు కోడి చంద్రయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి కిరణ్ కుమార్, అనిల్ కుమార్, బాలసుబ్రమణ్యం, నెహ్రూ రాయల్, కిషోర్ రాయల్, తులసి, ప్రసాద్, ప్రశాంత్ పలువురు జనసేన పార్టీ

చిత్తూరు అర్బన్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజులు పురస్కరించుకొని శనివారం జనసేన నాయకులు చిత్తూరు నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం, ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వేలూరు విట్ కళాశాల విద్యార్థులు అన్నదాన చేశారు.

నగరి: పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా మండలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి మెరుపుల మహేష్ ఆధ్వర్యంలో మేలపట్టు, కరకంతాపురం, కాకవేడు ఏఎడబ్ల్యూ, బీరకుప్పం గ్రామాలలో కేక్ కటింగ్, అన్నదానం చేశారు. అలాగే వెనుకబడిన తరగతుల వసతి గహాల్లో ఉన్న విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.



నగరిలో..

అన్నదానం



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ప్రసాద్ కుటుంబం శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నగరి: పట్టణంలో గల టీటీడీ అనుబంధ ఆలయమునైన కరియామణిక్యస్వామి ఆలయంలో నగరి ఓంశక్తి ఆలయ భక్తబందం వారు భక్తులకు అన్నదానం చేశారు. శనివారం సుమారు 300 మందికి భక్తులకు అన్న ప్రసాదం అందించారు. ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు, డాక్టర్ మంజుల సలహా సభ్యులు, ఓంశక్తి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

అరటి పంట నేలమట్టం



నేలమట్టమైన అరటి పంట

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని చిన్నగొల్లపల్లి పంచాయతీ, చిన్నగొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటరమణకు చెందిన ఎకరా 50 సెంట్లలో అరటి పంటను సాగు చేస్తున్నారు. శనివారం కురిసిన భారీ గాలివానకు పంట పూర్తిగా నేలమట్టమైంది. సుమారు రూ.2 లక్షలు అప్పు చేసి పండించిన పంట నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వాపోయారు. మరో 20 రోజుల్లో చేతికి వచ్చే పంట గాలివానకు పూర్తి నాశనం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

9న జాతీయ లోక్‌అదాలత్



ప్రజాశక్తి- పలమనేరు: ఈనెల 9న జరగబోయే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు కోరారు. శనివారం పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్ నందు న్యాయవాదులతో, పలమనేరు పట్టణ పరిరక్షణ సమితి వారితో మరియు పారా లీగల్ వాలంటీర్స్‌తో పలమనేరు పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సమిష్టిగా విజయవంతం చేయాలని కోరారు. కక్షిదారులు రాజీమార్గమే రాజమార్గంగా ఎన్నుకొని ఈసదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అధికసంఖ్యలో కేసులు పరిష్కరించబడడానికి అన్ని శాఖల వారు సహాయపడాలని తెలిపారు.

పగటి వేషాలను ప్రజల నమ్మరు...

మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పగటి వేషాలను ప్రజలు నమ్మరని జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా అన్నారు. శనివారం మండల అభివద్ధి కార్యాలయం ఆవరణంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 170 గొల్లపల్లి సర్పంచ్ కోక ప్రకాష్ నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకుల వద్ద మెప్పు పొందేందుకు కోసం పగటి వేషాలు వేస్తున్నాడని, దీనిని ప్రజలు నమ్మరని అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు జరిగాయని వాటన్నింటికీ ఆధారాలు ఉన్నాయని అన్నారు. 170 గొల్లపల్లిలో పంచాయతీకి నాలుగున్నర సంవత్సరాల వ్యవధిలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా ఐదు కోట్ల 91 లక్ష రూపాయలు పలు సంక్షేమ పథకాలు ద్వారా అందించామని అన్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రఅభివృద్ధి సంక్షేమ పథకాలు తెస్తుంటే తెలుగుదేశం పార్టీ కోర్టుల ద్వారా అడ్డుకుంటోందని విమర్శించారు. సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, శిరీష్ రెడ్డి, జైకుమార్, దత్తురెడ్డి, అమన్నాథ్, చెంగల్ రాయుడు, సర్దార్, ఫిరోజ్ అహ్మద్, శంకర్‌రెడ్డి, ఉషారాణి పాల్గొన్నారు.

'మహాశక్తి' మరింత చురుగ్గా చేపట్టండి!

టిడిపి మండల కన్వనర్ ఆనంద రెడ్డి

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర మహిళల భవిష్యత్తు కోసం టీడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు మండల వ్యాప్తంగా చేపడుతున్న మహాశక్తి కార్యక్రమాన్ని మరింత చురుగ్గా చేపట్టాలని రామకుప్పం మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, మహాశక్తి కోఆర్డినేటర్ కమతమూరు ప్రతాప్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీడిపి కార్యాలయంలో పార్టీ మహిళా ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి మహాశక్తి కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని బలపరచడానికి ప్రజలను సమయత్వం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయిబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు శాంతారామ్, తెలుగు యువత అధ్యక్షుడు విశ్వనాథ్, కుప్పం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జ్ఞానశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అలివేలు మంగమ్మ, పద్మమ్మ, సుగుణమ్మ, రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో పాడి ఆవు మృతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపలం విరాటపురం రోడ్డులోని గంగమ్మ గుడి వద్ద శనివారం విద్యుత్ షాక్‌కు గురై పాడిఆవు మృతి చెందింది. రెడ్డిరెడ్డి కాలనీకి చెందిన జయరామిరెడ్డి ఇటీవలే రూ.60వేలు పెట్టి పాడి ఆవును కొనుగోలు చేశాడు. విద్యుత్ స్తంభానికి సమీపంలో ఆవును కట్టేశాడు. వర్షాలు పడడంతో విద్యుత్‌షాక్ గురై ఆవు మరణించింది.

